కథ

# వేగంలోంచి వేదనలోకి

డా॥ ముక్తేవి భారతి

"నాకు మూడ్ లేదు" కవిత భర్త సుధాకర్ కౌగిలి వదిలించుకుని అటు తిరిగి పడుకుంది.

"అంటే" సుధాకర్ లైట్ ఆర్పాడు.

"అంటే, అంతే..." కవిత లైటు వేసి, బెడ్ రూమ్‌లోంచి బయటకొచ్చి సోఫాలో పడుకుంది.

పరమ చిరాగ్గా సుధాకర్ పడగ్గదిలోంచి వచ్చి, బాల్కనీలో నిలబడి సిగరెట్టు కాలుస్తూ, ఎదురుగా ఉన్న ఫ్లాట్ వైపు చూశాడు. ఆ ఫ్లాట్ హాలులో ఉన్న కర్టెన్ అటు ఇటూ కదులుతూంది. సుధాకర్‌కు సరదాగా అటే చూడాలనిపించింది. ఆ ఫ్లాట్‌లోకి ఈ మధ్యే కొత్త జంట అద్దెకొచ్చారు. ఆ అమ్మాయి జడ నిండా మల్లెపూలు పెట్టుకుంటుంది. అతడు ఆఫీసు నుంచి రావడం ఆలస్యం తలుపులేసుకుంటారు వాళ్లు. ఆ ఇంటి పనిపిల్ల ముందు వరండాలో కూచుని కూరలు తరగడమో, బట్టలు మడత పెట్టడమో చేస్తూంటుంది.

ఈ మధ్య సుధాకర్ వారం రోజులు సెలవు పెట్టాడు తండ్రి ఊరి నుంచి వచ్చాడని. అప్పుడు ఆ ఫ్లాట్ కేసి చూడ్డం బాగా అలవాటయింది. ఆ ఫ్లాట్‌లో అతను, సుధాకర్‌ని చూసి, 'హాయ్' అంటాడు. అదే ఇద్దరి పలకరింపు.

గదిలోంచి బయటకొచ్చిన సుధాకర్ ఇలా పొద్దుపోయాక రాత్రి ఆ ఫ్లాట్ వంక చూడ్డం ఇదే మొదటిసారి. సోఫాలో అతను, అతని ఒడిలో తల పెట్టుకొని ఆ అమ్మాయి..ఎదురుగా ఏదో చూస్తూ గలగలా నవ్వుతున్నారు. మిడ్‌నైట్ సినిమా అయి వుంటుందిలే అనుకుంటూ, వాళ్లు తనని గమనిస్తే బాగుండదనిపించి, లోపలకొచ్చాడు సుధాకర్ తనూ తన భార్యతో కలిసి, ఆ మిడ్‌నైట్ మూవీ చూడచ్చుగా అనుకుంటూ...సోఫాలో గాఢ నిద్రలో ఉంది కవిత. భార్యని నిద్రలేపాలనిపించింది కానీ, ఎందుకో లేపాలనిపించక సుధాకర్ తన గదిలోకి వెళ్లాడు. నిద్ర పట్టదు. ఎక్కడుంది పొరపాటు? ఎటు నుంచి ఈ సమస్యని సర్దుకు రావాలి? చిరాగ్గా ఆ మంచంపైన అటు ఇటూ కదుల్తూ పడుకుని గాఢంగా నిట్టూర్చాడు సుధాకర్. ఈ పరుగుల్లో అలసిపోయి బతుకులాగడమేనా!

పెళ్లప్పటికి సుధాకర్‌కి ముప్ఫయి ఐదేళ్లు. భార్య కవితకి ముఫ్ఫయి మూడేళ్లు. కవిత ఓ పెద్ద కంపెనీలో ఎగ్జిక్యూటివ్. సుధాకర్ మరో కంపెనీలో మేనేజర్. ఉద్యోగాలు బాగున్నాయి. డబ్బులూ విపరీతంగా ఉన్నాయి. కానీ, కానీ...జీవితంలో ఏదో వెలితి!

సుధాకర్ ఆలోచనలు ఒక్కసారిగా తన అమ్మమ్మ, తాతయ్య, తన తల్లి, తండ్రి, వారి జీవిత విధానంపై మరలాయి. ఎంత హాయిగా జీవించారు వాళ్లు. ఇంత గొప్ప ఇళ్లు లేవు, ఇంత డబ్బూ లేదు. సుధాకర్ తండ్రి ఓ ఆఫీసులో గుమస్తా. ఏనాడూ అమ్మ ముఖంలో అసంతృప్తి కానీ, నాన్న ముఖంలో చిరాకు కానీ తను చూడలేదు. పనులన్నీ అయిపోయాక దొడ్లో మల్లెపందిర దగ్గర మంచం వేసేది తల్లి. తండ్రి స్నానం చేసి, భోంచేసి ఆ వెన్నెల్లో మంచం మీద ఓ దుప్పటి పరుచుకు పడుకునేవాడు. అమ్మ ఇంటి పనులన్నీ పూర్తి చేసుకొని, సిగలో పెద్ద పూలచెండు పెట్టుకుని, ముఖానికి పౌడరు రాసుకొని, నాన్న పక్కన కూచునేది. ఎంత సేపో ఎన్నెన్నో కబుర్లు చెప్పుకునేవారు. పళ్లెంలో తమలపాకు, వక్కపొడి, సున్నం సీసా ఉండేవి. బాల్యంలో ఇవన్నీ తను గమనించేవాడు. ఈ రోజు సుధాకర్ కళ్ల ముందు ఆ అద్భుతమైన తల్లిదండ్రుల జీవిత విధానం గుర్తుకొచ్చింది. అంటే సుఖం, ఆనందం అనేవి డబ్బులో లేవు కదా!! ఉన్నట్టుండి సుధాకర్‌కి చాలా కోపమొచ్చింది. తనపైన, ముఖ్యంగా కవితపైన. గడియారం వంక చూసాడు. కవిత ఆఫీసుకెళ్లేందుకు టైం అవుతోంది.

సుధాకర్ తిన్నగా కవిత దగ్గరకొచ్చాడు. ఎర్రటి లిప్‌స్టిక్ పెదాలు, స్లీవ్‌లెస్ బ్లౌజ్, జుట్టు భుజాల వరకు వేలాడుతోంది. ఖూబ్ సూరత్! అంటూ దగ్గరగా వచ్చి బుగ్గల మీద ముద్దు పెట్టుకున్నాడు సుధాకర్. కవిత చిరాగ్గా ముఖం పెట్టి, "అబ్బా, చీర నలిగిపోతుంది ప్లీజ్" అంది సుధాకర్‌ని గుండె

లకు హత్తుకుంటూనే.

''మరో చీర మార్చుకో'' సుధాకర్ కవితను బెడ్ రూమ్ వైపు లాగుతూ అన్నాడు.

''ప్లీజ్ నాకు మూడ్ లేదు'' సుధాకర్ నుంచి విడిపించుకొని, ఒక్కసారి అద్దముందు నిల్చుని పౌడరు మరోసారి రాసుకొని, చెప్పులు తొడుక్కుంటూ 'బై' అంది నవ్వుతూ కవిత.

సుధాకర్ కవిత వెళ్లగానే తలుపేసుకొని మంచం మీద వాలిపోయాడు. ఛీ, ఏమిటో దాపంత్యం, అర్థరహితం. నిస్సారం. డబ్బు... డబ్బు...పరుగు..పరుగు.. ఆడది ఆడదానిలా ఉండదా? మగాడు మగాడిలా ఉండడా? ఈ సంసారాలు ఎక్కడికి దారితీస్తాయి?

ఆరోజు సుధాకర్ మూడ్ పూర్తిగా పాడయింది. ఆఫీసుకి వెళ్లాలనిపించలేదు. ఆఫీసులో ఉన్నంతసేపూ ఎంతో యాక్టివ్‌గా ఉండే కవిత, ఇంటికి రాగానే అలసిపోయాననడం ఛీ...ఆడవాళ్లు ఉద్యోగాలు చేయకపోతేనేం...? హమ్మో! ఈ మాట అన్నట్లు తెలిస్తే చాలు కవిత మాత్రమే కాదు, మొత్తం మహిళామణులంతా క్షణాలలో నా గొంతు నొక్కేయగలరు. ఓకే...ఉద్యోగాలు చేయండి. కానీ, ఎప్పుడూ ఇల్లాలు అలసిపోయానని, మూడ్ లేదని అంటే భర్త ఏం చేయాలి? అలా ఆలోచిస్తూ సుధాకర్ కోపంగా ఎదురుగుండా ఉన్న టీ కప్పు విసిరి కొట్టాడు. అన్‌బ్రేకబుల్ కప్ అది. అయినా రెండు ముక్కలయింది.


సుధాకర్‌కి చాలా చిరాగ్గా అనిపించి, తన ఫ్రెండు జయరామ్‌కి ఫోన్ చేశాడు...చిన్ననాటి నుంచి స్నేహితుడు. వ్యాపారస్తుడు.


స్నేహితులిద్దరూ ఎదురుబొదురుగా కూర్చున్నారు. ''అంత అర్జంటుగా రమ్మన్నావేమిటి?'' అన్నాడు సిగరెట్టు పొగ యాష్‌ట్రేలో దులుపుతూ జయరామ్.

''లైఫ్ చాలా బోర్‌గా అనిపిస్తోంది కొన్ని సార్లు'' అన్నాడు సీరియస్‌గా సుధాకర్.

జయరామ్ ఫక్కున నవ్వాడు.

''డబ్బులేని వాడు, డబ్బున్నవాడు, భార్య, పిల్లలు ఉన్నవాడు, ఏమీ లేని నాలాంటి వాడూ...





Story

అందరూ
లైఫ్ బోర్‌గానే
ఉందనే అంటున్నారు.
సుధా...ఇంతకీ ఏమైందో
చెప్పు'' అన్నాడు.

చెప్పాలా?వద్దా? అనుకున్నాడు కానీ... స్నేహితుడి దగ్గర రహస్యాలైతే, ఇంకెవరి దగ్గర మనసు విప్పి చెప్పుకోగలడు తను అని అనుకొని, ''చెప్తా'' అంటూ లోపలకెళ్లి రెండు గాజు గ్లాసులు, ఐస్‌ట్రే, డ్రింకు తెచ్చి బల్లముందుంచాడు సుధాకర్.

స్నేహితులు గ్లాసులు నింపుకొని, ఛీర్స్ చెప్పుకోటమయింది.

''అఫ్‌కోర్స్ సమస్య కాదనుకో... అయినా పెద్ద సమస్య కూడా! పెళ్లయి నాలుగేళ్లయిందిగా, ఇంకా పిల్లలు వద్దంటే ఎలాగా? షి ఈజ్ నైస్, కానీ నన్ను దగ్గరికే రానీయకపోతే పెళ్లి, దాంపత్యం, శృంగారం, పిల్లలు...ఇవన్నీ నాన్‌సెన్సేనా? భార్య భర్త అన్నాకా, చిన్న వయసులో ఉన్నాక, దూరంగా ఉండడం సాధ్యమా? అవసరమా? ఏమిటో, ఏం చెప్పాలో తెలియడం లేదు.'' సుధాకర్ మాటలు ఆపి, గ్లాసులో మళ్లీ నింపుకున్నాడు.

''నువ్వంటే....'' జయరామ్ నెమ్మదిగా అన్నా, ఉలిక్కిపడ్డాడు సుధాకర్.

''నేనంటే ప్రాణం. ఆఫీసు నుంచి వీలు చిక్కినప్పుడల్లా గంటల గంటలు మాట్లాడుతుంది. అంతే కాదు, నాకిష్టమైనవన్నీ కొని తెస్తుంది. 'ప్లానింగ్' ఇక చాలు అంటే వినదు. ఇంక నేనెప్పుడు అవుతాను తండ్రిని?'' సుధాకర్ ఆవేశంగా గొంతు పెంచి, పక్కనున్న సిగరెట్ ప్యాకెట్‌ను విసిరికొట్టాడు.

జయరామ్‌కి పరిస్థితి అర్థమయింది. ఆ అమ్మాయి ఇప్పట్లో పిల్లల్ని కనదు. వీడికి పిల్లలు కావాలి. పెద్ద సమస్యే! ఇద్దరికీ ఒకరిపై ఒకరికి ప్రేమ, ఒకరంటే ఒకరికి ఇష్టం. ఒకర్ని విడిచి ఇంకొకరుండరు. కానీ...జయరామ్ చిన్నగా నవ్వి, ''గడియారం చూడు. మీ ఆవిడొచ్చే టైం అయింది. ఆఫీసుకు వెళ్లకుండా ఇంట్లో కూచున్నావంటేనే కోపం రావచ్చు.''

''ఆ...ఆవిడ కోపంతో నాకేం పని అయినా....'' అంటూండగానే కాలింగ్ బెల్ మోగింది. తలుపు తీశాడు సుధాకర్.

''చెల్లాయ్ ఇప్పుడే వచ్చా. మీరిద్దరూ, మా అక్కాచెల్లెలు, నేను, అన్న, వదినలతో కలిసి సింగపూర్ ప్లాన్ చేశాను. ఆ విషయం మాట్లాడడానికే వచ్చా. రేపొచ్చి ఎప్పుడు బయల్దేరాలో, మీరు సెలవులెన్ని రోజులు పెట్టుకోవాలో అన్నీ చెప్తా...

వస్తారా,
సుధా...''
అంటూ హడావిడిగా
బయటకెళ్లిపోయాడు జయ
రామ్. కవిత బట్టలు మార్చుకునేం
దుకు లోపలకి వెళ్లగానే, సుధాకర్ తన
గదిని గబగబా శుభ్రం చేసేసాడు.

ఇద్దరూ కూర్చుని కాఫీ తాగుతుండగా, సుధాకర్ అన్నాడు, ''కవితా, సింగపూర్ ట్రిప్పు మావాడు బాగా ఏర్పాట్లు చేస్తాడు. వెడదాం మనిద్దరం'' అన్నాడు.

''మీకసలు బుర్ర పనిచేయడం మానేసిందా? ఇప్పుడు సింగపూర్ మలేషియా, ప్లెజర్ ట్రిప్పులకు వెళ్లే టైమా ఇది?''అంది నైటీకి ఉన్న లేసులు సరిచేసుకుంటూ.

ఒక్క నిమిషం సుధాకర్‌కేమీ అర్థం కాలేదు. ఇది టైమా అంటే?!

''అదేనండీ, పై నెలలో నాకు ప్రమోషన్ రావచ్చని నేను ఆలోచిస్తూ, ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా కష్టపడి పనిచేస్తున్నా కదా! మీకు తెలుసుగా, మరి ఎంజాయ్‌మెంట్ ఏమిటి? అతనేదో అంటాడు. మీరు గంగిరెద్దులా తలూపటమేనా? నా భార్యని అడిగి చెప్తాననైనా అన్నారా? మేమిద్దరం రెడీ అనేశారా?'' అలా అంటూ కవిత సుధాకర్ భుజంపైన వాలింది. ''ఈ ప్రమోషన్ వచ్చేస్తే నా జీతం ఎంతో ఊహించుకోండి. జీవితంలో గొప్ప టర్నింగ్ పాయింట్. ఒక్కసారి ప్రమోషన్ వచ్చేస్తే ఓ మొగాడ్!! ఎంత అదృష్టమో తెలుసా, ఈ కారు తీసిపారేసి లేటెస్ట్ కారు కొనుక్కోవచ్చు. సింగపూర్, సింగినాదం ఏమిటి? యూరప్ ట్రిప్ వెడదాం మనం'' అంది సుధాకర్ జుట్టులోకి వేళ్లు పోనిచ్చి, గట్టిగా కౌగిలించుకుని.

సుధాకర్ ఉత్సాహం నీరు కారిపోయింది. తన మనసులో ఆవేదన నోరు విప్పి చెప్పేయాలి అని నిశ్చయించుకున్నాడు.

కవిత తనకి ప్రమోషన్ వస్తే, ట్రాన్స్‌ఫర్ వస్తే, వెళ్లాలి, మరి తప్పదు కదా, కెరీర్ చాలా ముఖ్యం

అని
మనసులో
రకరకాలుగా
ఆలోచిస్తోంది.

టీవీలో ఫారెక్స్ బేబీ తప్పటడుగులు వేస్తూ ముద్దులు మూటకడుతూంటే చూడండి, ''ఐ లైక్ దిస్ బేబీ'' అంది. సుధాకర్ వెంటనే టీవీ కట్టేశాడు.

''కవితా, బెడ్‌రూమ్‌లోకి రా'' అన్నాడు సీరియస్‌గా.

''ఇక్కడ హాల్లో మాట్లాడుకోవచ్చుగా'' అంటూ భర్త వెంట పడగదిలోకి వెళ్లింది కవిత.

''నిన్ను నేనేమీ కోరను ఇప్పుడు'' అన్నాడు సుధాకర్ కవితతో కోపంగా.

కవిత కిలకిలా నవ్వి, ''నేను కోరితే'' అంది కొంటెగా చూస్తూ.

అంత భాగ్యమా? అని సుధాకర్ మనులో అనుకొని, పైకి మాత్రం చాలా గంభీరంగా ముఖం పెట్టి, భార్య మాటలు పట్టించుకోకుండా, ''ఒక్క మాట చెప్పు పెళ్లప్పుడు నీకెన్నేళ్లు?'' సుధాకర్ అనగానే, ఉండండి, ఏసి కొంచెం పెంచి చెప్తా అని, ''నాకెన్నేళ్లా? మీకన్నా రెండేళ్లు చిన్న. అసలు నాకన్నా చిన్న వాణ్ని చేసుకుంటా అనేదాన్ని చదువుకునే రోజుల్లో'' అంది భర్త ఒడిలో తలపెట్టుకొని,

''ఓ చిన్న బుజ్జిగాడిని ఒళ్లో పెట్టుకోవాలని అనిపించదా? అయినా, నీకనిపించడం లేదేమో కానీ నాకు చాలా అవమానంగా ఉంది. నాకింకా పిల్లలు లేరంటే..''

''మనకి కావాలంటే కంటాం. అక్కర్లేదనుకుంటే

మానేస్తాం. అంతే'' అంది కవిత సుధాకర్ కళ్లల్లోకి చూస్తూ.

సుధాకర్ క్షణం ఆగి, ''నా బాధ అర్థం చేసుకో. మొన్న నా స్నేహితుడితో మరొకడు కలిసాడు. వాడికి ముగ్గురు పిల్లలు. వాళ్లని ఏ స్కూల్లో చేర్చాలని ఆలోచిస్తూ, నాకెందరు పిల్లలని అడిగాడు. ఇంకా పిల్లలు లేరని తెల్సి, ఛీ....అప్పుడు వాడన్న మాట ఇప్పుడు గుర్తొస్తే...ఏమన్నాడో తెలుసా... ముందు ఒకళ్లని కన్నాక అప్పుడు ప్లానింగ్ అండీ, అసలు పుడతారో, పుట్టరో తెలియాలిగా అంటూ వెకిలిగా నవ్వాడు. అంతే కాదు, అందరూ నన్ను చూసి ఏదో రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. చివరకి, నా ఫ్రెండు కూడా రహస్యంగా, ఒక్కసారి మంచి డాక్టర్ని కలు అన్నాడు. నేనసలు మగాడినే కాదు అనే అనుకుంటున్నారంతా'' సుధాకర్ అనగానే...

సుధాకర్ ఒళ్లోంచి కవిత లేచి, ''మీరు చెప్పలేదా?మేము ప్లానింగ్ చేస్తున్నామనీ, అయినా మనం పిల్లల్ని కనడం కూడా అందరికీ అవసరమా? మనం ఎవరికి జవాబివ్వాలంటారు? వాళ్లందరి నోరూ మూయించి, మీకెందుకు నా విషయం గెట్ అవుట్ అనాల్సింది. అంతే కానీ అదేదో మీ మనసుని గాయపరిచి, మిమ్మల్ని బాధ పెట్టే విషయమా? ఏ పనీపాటా లేని వాళ్లు వాగే వాగుళ్లవి'' అని తీసిపారేసి, 'ఇవాళ మనం హోటల్‌లో డిన్నరు చేస్తున్నాం. ఇంట్లో వంట చేయను' అంది కవిత.

ఇక కవితతో బెదిరించినట్లు చెప్పాల్సిందే అనుకున్నాడు సుధాకర్ మనస్సులో.

''నాకు తెలుసున్న ఒకతను చెప్పాడు. ఈ ఉద్యోగాల పరుగులు, డబ్బులు, డబ్బులు, ఈ గోలలో పడ్డ జంటలకి పిల్లలు పుట్టడంలో చాలా ఇబ్బందులొస్తున్నాయని, వయసు దాటిపోవడం, ఏళ్లతరబడి ప్లానింగ్, ఇవన్నీ కారణాలని అతను చదివాడట. ఒక మెడికల్ జర్నల్‌లో కూడా ప్రచురించారు. స్త్రీ, పురుషుల మధ్య, అదే దంపతుల మధ్య సెక్సు కూడా సమస్యేనని, అందుకే పెళ్లయిన రెండు మూడేళ్లకే పిల్లల్ని కనేయాలని, తరువాత పిల్లలు పుట్టడం కష్టమని, ఆ తరువాత డాక్టర్ల చుట్టూ, గుళ్ల చుట్టూ తిరిగినా ప్రయోజనం శూన్యం అని...''

ఇలా సుధాకర్ చెప్తుంటే, కవిత ఫ్రిజ్ తెరిచి, ఐస్ క్రీమ్ తెచ్చుకుని తింటూ, ''ఎన్ని కట్టు కథలు కల్పిస్తారు మీరు? మీ ఫ్రెండు లేడు, మెడికల్ జర్నలూ లేదు, టెన్షన్ వల్ల సెక్సు సమస్యలూ లేవు, ఇవన్నీ నన్ను మీ దారికి తెచ్చుకోవడానికి ఆడుతున్న అద్భుతమైన కథలు. నాకు తెలుసండీ, అయినా ఒక్క సంవత్సరం ఆగుదాం. ఆ తర్వాత పిల్లలే పిల్లలు'' పకపకా నవ్వింది కవిత.

''స్టుపిడ్ ఉమెన్. మగాడిగా సంఘంలో నా పరిస్థితి అర్థం చేసుకో నువ్వు. నీక్కావలసింది ప్రమోషన్'' కవిత చేతిలోంచి కప్పు విసిరికొట్టాడు సుధాకర్. 'నేను డిన్నర్‌కి రాను' భార్యాభర్తలు అన్నాలు తినకుండా చెరో గదిలో పడుకున్నారు. నిశ్శబ్దం!!

నెలరోజులు గడిచిపోయాయి....


''అన్నయ్యా ఫోను''-మెట్ల కింద నుంచి చెల్లెలు అరిచింది. ఇంత రాత్రి ఫోనేమిటి? ఎవరో అనుకుంటూ జయరామ్ మెట్లు దిగాడు.

''హాయ్ చెప్పు ఏమిటి విశేషం?'' అన్నాడు సుధాకర్‌తో.

''నేను, కవితా ఎల్లుండి హార్సిలీ హిల్స్ వెడుతున్నాం. నీకొక్కడికే ఆనందం దాచుకోలేక చెప్తున్నా.''

''హానీమూన్-బెస్ట్ ఆఫ్ లక్'' జయరామ్ అంటుంటే ఫోన్ కట్టయింది.

కవిత సుధాకర్ చేతిలోంచి ఫోన్ లాక్కుంది. ''ఛీ... మనిద్దరం, మూడో మనిషికి తెలియకుండా, వెళ్లి రావాలని అనుకున్నాం కదా. ఎంత ప్రాణస్నేహితుడైనా ఏది చెప్పాలో, ఏది చెప్పకూడదో తెలియదు మీకు''




సుధాకర్‌కు ఒళ్లు మండిపోయింది. ''నీ ఉద్దేశం ఏమిటి? ఇందులో తప్పేమిటి? కవితా ఆఖరిసారిగా చెప్తున్నా. నువ్వేదో పెద్ద గొప్పదానిపోయినట్లు, చాలా తెలివైనదానివి అయిపోయనట్టు నేనేదో ఒక ఫూల్‌ని, స్టుపిడ్‌ను అయినట్లు, వాగావంటే చూసుకో....'' సుధాకర్ కోపం అణుచుకున్నాడు. చెంపకాయ కొట్టాలనిపించింది. ''ప్రతీదానికి నోరు మూయించాలని నువ్వు అనుకుంటే, మళ్లీ చెప్తున్నా, ఉద్యోగం మాని ఇంట్లో కూచో. నీ సంపాదన నిన్ను చాలా విధాల నష్టపెడుతోంది గమనించు. ఇంకొక్కసారి నన్ను తక్కువగా తీసిపారేసినట్లు మాట్లాడితే ఏం జరుగుతుందో నేను చెప్పను.''

సుధాకర్ బయటకు వెళ్లి సిగరెట్టు ముట్టించాడు. కవిత ఒక్క క్షణం మాట్లాడలేదు. సుధాకర్ దగ్గరకు వచ్చి 'లోపలికి రండి' అంది.

''డియర్ ఒక్కమాట విను. అంత కోపమా?నేనన్నది మీ మేలు కోరే. నన్నర్థం చేసుకోరూ'' అంటూ ఏదో సినిమా డైలాగులాగా సాగదీస్తూ అని, సుధాకర్ బుగ్గలపై ముద్దుల వర్షం కురిపించేసింది. ''నేనెందుకు అన్నావంటే, మనం హనీమూన్‌కి వెడుతున్నామని రకరకాలుగా ఊహించేసుకుని, రెండు నెలలు తిరక్కుండా కొత్త విశేషాలేమీ లేవా? అని అతను నవ్వితే, నువ్వు మళ్లీ మనసు బాధపెట్టేసుకొని ఇదయిపోతావు. అందుకని అందరికీ చెప్పద్దన్నా. అయినా నేను మీ భార్యని, ప్రియురాలిని, స్నేహితురాలినీ, ఇంకా మీ శ్రేయోభిలాషినీ'' అంటూ కవిత సుధాకర్ ఒళ్లో వాలిపోయింది. సుధాకర్ కౌగిలిలో ఉక్కిరిబిక్కిరయింది.

అంతలో, సుధాకర్‌కి అనిపించింది. ''అంటే కవిత ఉద్దేశమేమిటి? హార్సిలీ హిల్స్ వెళ్లి హోటల్లో భోంచేసి, అటు ఇటూ తిరిగి వచ్చేయడమేనా? ఇది హనీమూన్‌లా ఎంజాయ్ చేసి, నెలతిరక్కుండా కవిత గర్భవతి కావడం, ఆ తర్వాత, కారు డ్రైవింగ్ తను చేయక, డ్రైవర్‌ని పెట్టుకోవడం, కొద్ది నెలలు ఆఫీసుకెళ్లడం, ఆ తర్వాత మెటర్నిటీ లీవు...

సుధాకర్ ఇలా అనుకుంటూ కవిత బుగ్గలు నిమిరి, ''కవితా, ఈ హనీమూన్ అలాంటి హనీమూన్ కాదు. ఇది మనిద్దర్నీ అమ్మానాన్న చేసేందుకు అంకురం వేయాలి'' ఈ మాట అని సుధాకర్, 'అవన్నీ విసిరిపారేయ్' అన్నాడు రహస్యంగా.

కవిత ఒక్క నిమిషం మాట్లాడలేదు. సుధాకర్ ఉద్దేశం అర్థమయిపోయింది. తల్లిని అవాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకునే అధికారం, హక్కు నాకు లేదా? అతనికి ఇష్టమైతే నేనెందుకు కనాలి? సరదాగా ఓ నాలుగు రోజులు హార్సిలీ హిల్స్‌కి వెళ్లాలనుకున్నాం. ఇద్దరం ఆఫీసు పనులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం కనుక కాస్త విశ్రాంతికని, అంతే కానీ, కవిత ముఖకవళికలు మారాయి. ఇదే పురుషాధిక్యం?

వెంటనే పడగ్గదిలోంచి బయటకొచ్చింది. 'నేను రాను' అని అరిచి చెప్పింది. సుధాకర్ అవాక్కయ్యాడు. ''ఏమయింది కవితా? హార్సిలీ హిల్స్ బాగుండవనుకుంటే నీ ఇష్టం. ఎక్కడికెడదామో చెప్పు అక్కడికే వెడదాం'' అంటూ బతిమలాడాడు.

''సెలవు క్యాన్సిల్ చేసుకుంటున్నా. రేపట్నుంచి ఆఫీసుకి వెళుతున్నా...'' అంటూ బాల్కనీలో కుర్చీ వేసుకొని కూర్చుంది.

''ఛా, నువ్వసలు ఆడదానివా? భర్త, దాంపత్యం అక్కర్లేదనుకుంటే పెళ్లెందుకు?''

***

కాలం పరిగెత్తింది. కవిత ఉద్యోగంలో ప్రమోషన్లు అనుకున్నట్లుగా వచ్చేసాయి. సుధాకర్‌కూ పెద్ద పెద్ద కంపెనీలు గొప్ప ఆఫర్లు ఇస్తున్నాయి.

ఉన్నట్లుండి కవిత మనసు ఆరోజు చిన్నబోయింది. చిన్ననాటి స్నేహితురాలు రజిత వచ్చింది. రజిత బిఎ పాసయిపోగానే పెళ్లిచేసుకొని, విజయవాడ వెళ్లింది. ఆ తర్వాత దాని పిల్లలు, చదువులు, బాధ్యతల మధ్య అప్పుడప్పుడు ఫోన్ చేసేది. ఒకటి రెండు సార్లు తను బిజీ అని తర్వాత చేస్తానని ఫోన్ పెట్టేసింది కవిత.

రజిత భర్తకి హైదరాబాద్ బదిలీ కావడంతో ఇక్కడకు వచ్చింది. కవితను చూడాలనిపించి ఓరోజు వచ్చింది. స్నేహితురాళ్లిద్దరూ చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకున్నాక, మా వారి పిన్ని పెద్ద డాక్టరు. ఇక్కడే ఉంది అంటూ ఆడాక్టరు గారి నర్సింగ్‌హోమ్, అడ్రస్ చెప్పి, గొంతు తగ్గించి మీరిద్దరూ ఒక్కసారి డాక్టరుకి చూపించుకోండి. ''మరీ ఆలస్యం అయితే పిల్లలని పెంచడం తలనొప్పి. ఈ మధ్య మా వాళ్లమ్మాయి పిల్లలు లేరని, అనాథ శరణాయలం నుంచి ఓ పిల్లని తెచ్చుకుంది''. ఆ మాట రజని అనగానే 'మంచి పని చేసింది కదా' అంది కవిత. రజని ఫక్కున నవ్వి, 'పిల్లని పెంచే ఓపిక ఉందా దానికి?ఆ పిల్లని ఇంటి పనిపిల్లని చేసేసింది' అంది బాధగా రజిత.

'ఛీ' అంది కవిత.

రజిత వెళ్లిపోయాక కవిత మనసు రకరకాల ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరయింది. తన గొప్ప అత్యాధునికమైన భవనాన్ని చూసి, తన గొప్ప కారుని చూసి, తన రకరకాల బంగారు నగలని చూసి, తను కట్టుకునే ఖరీదైన చీరలను చూసి, తనని అభినందించే వారెందరో. తను ఆనాడు పొందిన ఆనందం ఎన్ని రెట్లు గొప్పది! తన పరుగుల జీవితం తనకి తృప్తి నిచ్చింది అప్పుడు. తన బంధువులు, స్నేహితుల్లో తను చాలా గొప్పది. కానీ, కానీ కవిత కళ్లల్లో ఓ నీటి పొర కదిలింది! ఏం పోగొట్టుకుంది?

సుధాకర్‌లో చాలా మార్పు వచ్చేసింది. ఇంట్లో ఇద్దరే! అబ్బా బోర్! కుర్రతనం ఛాయలు పూర్తిగా దూరమయిపోయి, ఎంతో గంభీరత్వం.

కవిత జుట్టులో అక్కడక్కడ వెండితీగలు మెరుస్తున్నాయి. ''తిరుపతికి వెళ్లాలనుకుంటున్నా. మీరు సెలవు పెట్టుకోండి మరి'' అంది ఓ ఆదివారం భర్త పక్కన కూచుని కాఫీ తాగుతూ...

''నువ్వెళ్లు'' అన్నాడు పేపరు తిరగేస్తూ సుధాకర్.

''నడిచి కొండ ఎక్కాలని అనుకున్నాను''

సుధాకర్ పేపరు అడ్డం పెట్టుకొని నవ్వి ''ఎక్కు'' అన్నాడు.

కవిత ఏమీ అనలేదు. ఇంతవరకూ విశ్రాంతి తెలియకుండా పరిగెత్తింది జీవితంలో. ఇప్పుడనిపిస్తోంది. అంత పరుగు అవసరమా? మానవ విలువల్ని వదిలేసి డబ్బు సంపాదించడమే జీవిత లక్ష్యంగా తను గడిపిన జీవితం...తలుచుకుంటుంటే ఇప్పుడు మనసుకి అనిపిస్తోంది, ఎంత అర్థరహితంగా కాలం గడిచిపోయిందీ అని!!

కవిత బాల్కనీలో నిలబడి ఎదురుగా ఉన్న గుడిసెల వంక చూసింది. ఫ్లాట్లు పూర్తయ్యే వరకూ కుటుంబాలన్నీ ఇక్కడే ఉంటాయి. అలా చూస్తోంటే, పిల్లాడికి పాలిస్తున్న రంగమ్మ కనిపించింది. సిగ్గులేకుండా అలా గుమ్మం ముందు కూచుని!! కవితకి అలా అనిపించిన మరుక్షణమే మనసు మరో మాట గుసగుసగా చెప్పింది. అదే మాతృత్వం! అదే మాతృత్వం!!

కవిత గబుక్కున లోపలకొచ్చింది. సుధాకర్

కవిత పెదాలపై చిరునవ్వు కదిలి మాయమైంది. ఇప్పుడు హార్సిలీహిల్స్ వెడదాం అనగలనా! ఇప్పుడు తల నిండా మల్లెపూలు పెట్టుకొని వెన్నెల రాత్రిలో భర్తతో విహరించగలనా!! ఇప్పుడు ఓ పసిగుడ్డుని పెంచి పెద్ద వాడ్ని చేయగలనా!! ఇప్పుడు.. ఇప్పుడు...!! కవిత కళ్లలో నీళ్లు ఆపుకోలేకపోయింది.

పేపరు ముఖం మీదుంచుకొని నిద్రపోతున్నాడు.

కవిత పెదాలపై చిరునవ్వు కదిలి మాయమైంది. ఇప్పుడు హార్సిలీహిల్స్ వెడదాం అనగలనా! ఇప్పుడు తల నిండా మల్లెపూలు పెట్టుకొని వెన్నెల రాత్రిలో భర్తతో విహరించగలనా!! ఇప్పుడు ఓ పసిగుడ్డుని పెంచి పెద్ద వాడ్ని చేయగలనా!! ఇప్పుడు.. ఇప్పుడు...!! కవిత కళ్లలో నీళ్లు ఆపుకోలేకపోయింది.

జీవితం షడ్రుచుల సమ్మేళనం!!

కవిత గబాగబా సుధాకర్‌ని లేపింది.

''ఏమిటి? మంచి నిద్ర పాడుచేశావు?'' చిరాగ్గా అంటూ పక్కనున్న కళ్లజోడు తీసి పెట్టుకున్నాడు.

సుధాకర్ మోకాళ్లమీద తల ఆన్చింది కవిత.

''ఒక్కమాట వినాలి మీరు''

''ఏమంది? ఇన్‌ఫెర్టిలిటీ క్లీనిక్‌కి వెడదామండీ, లేపోతే అనాథశరణాలయం నుంచి పిల్లాడిని తెచ్చి పెంచుకుందామండీ, లేకపోతే ఊరవతల ఫామ్ హౌస్ కొందామండీ, లేకపోతే ఈ పెద్దకారు తీసేసి మరొకటి కొందామండీ, ఇవే ఇవేగా నువ్వు చెప్పేది. ఇలాంటివి నీనుంచి వినివినీ విసుగొచ్చేసింది. ఒక విధంగా అలసిపోయా. నన్ను అడక్కు.. నీకేం కావాలంటే అది చేసుకో'' సుధాకర్ ఆవులిస్తూ కుర్చీ లోంచి లేచాడు.

కవిత అలానే కూచుంది. రంగమ్మ, దాని ఒళ్లో పిల్లాడు. తల్లి కొంగు నోట్లో పెట్టుకొని నములుతున్న రెండేళ్ల పసిపిల్ల, ఎదురుగా రాళ్లగుట్ట దగ్గర మట్టిలో ఆడుకుంటున్న మరో చింపిరి జుట్టు పిల్ల. ముగ్గురూ రంగమ్మ పిల్లలే. ముగ్గురు పిల్లల పెంపకం కష్టం కాదూ...కవిత మనసులో మరో కొత్త ఆలోచన.

కవిత, సుధాకర్ భోజనం చేస్తున్నారు.

''నాకో ఆలోచన వచ్చిందండీ....ముందు మీరు వినాలి. అయినా భర్త సహకరించకపోతే భార్య ఏమి ఆలోచించి ఏం చేస్తుంది'' భర్త కళ్లల్లోకి చూస్తూ అంది కవిత.

ఇంక మనసులో మాట చెప్పేయాలని నిశ్చయించుకొని,

''ఆ రంగమ్మ...అదే పిల్లల్ని చంకనేసుకొని వచ్చి, చల్లని నీళ్లిమ్మని, కాస్త పచ్చడి పెట్టమని వస్తుంది కదా. అదేనండీ, ఫ్లాట్స్ కట్టే మేస్త్రీ పెళ్లాం'' అంది.

''ఏమిటో చెప్పు. ఏమైంది రంగమ్మకి'' అన్నాడు సుధాకర్.

''దానికి, ముగ్గురు పిల్లలా? ఎలా పెంచుతుందీ?''

''నీకెందుకూ? వాళ్లు హాయిగా పెంచుకోగలరు''

''అబ్బా! నా మనస్సు గ్రహించలేరు కదా? ఒక పిల్లని అదే, మూడేళ్లదాన్ని మనం తెచ్చి..''

కవిత మాట పూర్తి చేయలేదు. సుధాకర్ పెద్దగా నవ్వి, ''ఆ ఆలోచన ఆపేయ్. వాళ్లు పేదవాళ్లే కానీ, కన్నపిల్లల్ని మనలాంటి వారికిచ్చేసే పేదవాళ్లు కారు. ఈ మాట వాళ్లకి తెలిస్తే, అందులో ఆ తల్లి రంగమ్మకి తెలిస్తే, నీతో పోట్లాటకొస్తుంది. పిల్లలే వాళ్ల సంపద'' సుధాకర్ డైనింగ్ టేబుల్ దగ్గర్నుంచి లేచి వెళ్లిపోయాడు.

కవితకి తెలుసు.సుధాకర్ మాటల్లో అర్థం. పదేళ్ల నాడు సుధాకర్, చాలా బీద స్థితిలో ఉన్న దూరపు బంధువు కొడుక్కి చదువు చెప్పించి, దగ్గర పెట్టుకుందామని, కవితకి చాలా విధాలుగా చెప్పి చూశాడు.

''నాన్సెన్స్, ఎవరి పిల్లల్నో నేను పెంచి పెద్ద చేసి నా కష్టార్జితాన్ని వాళ్లకి ధారపోయాలా?'' అంటూ భర్త మాటలు పడనీయలేదు.

ఇప్పుడు కవిత మాటలకి అర్థం లేదనిపించింది సుధాకర్‌కి.

''పెంచుకోవడం కాదు. ఆ పిల్లకి చదువు చెప్పించి, పెళ్లిచేసి,'' కవిత సుధాకర్ దగ్గరకొచ్చి అంది.

''కవితా, జీవితం అంటే పరిగెత్తాలనుకుంటే అలసటే మిగులుతుంది. ఆనందం దూరమయిపోతుంది. నీలాంటి వాడే ఒకడు పరిగెత్తి, పరిగెత్తి చివరికి ఆకథ చెప్పనులే....''

కవిత మాట్లాడకుండా బాల్కనీలోకి వెళ్లింది. చిన్నగుడిసె, బయట రంగమ్మ, పిల్లాడికి పాలిస్తోంది. పక్కనే కూచుని బీడీ తాగుతున్న మేస్త్రీ శివయ్య...మట్టిలో ఆడుకుంటున్న చిన్నఅమ్మాయి.

కవిత బాల్కనీలోంచి లోపలకొచ్చింది. ఎ.సి. బెడ్ రూములో టీవీలో క్రికెట్ చూస్తున్నాడు సుధాకర్.

కవిత ఆ బెడ్‌రూములో కర్టెన్ దగ్గరగా వేసి, మళ్లీ బాల్కనీలోకొచ్చి నిలబడింది. ఎదురుగా ఉన్న గుడిసె దగ్గర ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తూ...

◆